సాక్షి
కుమురం భీం

బుధవారం : 6 : ఆగస్టు : 2025



పర్యాటకం.. అభివృద్ధికి దూరం
నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టు ప్రముఖ పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందింది. సరైన సౌకర్యాలు లేకపోవడంతో సందర్శకులు ఇబ్బంది పడుతున్నారు. 10లో▸



బడి చదువులు.. భయం భయం
కెరమెరి మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరాయి. విద్యార్థులు భయంభయంగా చదువులు కొనసాగిస్తున్నారు. 11లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
32.2 /26.6
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. ద్రోణి ప్రభావంతో అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎస్పీఎంలో స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలి



వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

ఆసిఫాబాద్‌అర్బన్: కాగజ్‌నగర్ పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్లులో స్థానిక నిరుద్యోగులకే ఉద్యోగావకాశాలు కల్పించాలని ఉద్యోగ కల్పన పోరాట సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో మంగళవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారిని కలిసి వినతిపత్రం అందించారు. ఆ సంఘం కన్వీనర్ రమేశ్ మాట్లాడుతూ ఎస్పీఎం పునఃప్రారంభ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.కోట్ల రాయితీలు, మినహాయింపులు పొంది స్థానికేతరులకు(ఇతర రాష్ట్రాల వారికి) ఉద్యోగాలు కల్పించడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు విద్యార్హతలు, నైపుణ్యాలను పరిగణనలోకి తీసుకుని మిల్లులో 75శాతం మంది స్థానిక ఉద్యోగులు విధుల్లో చేరేవిధంగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో హైమద్, తాజొద్దీన్, సాయి తదితరులు ఉన్నారు.

వృద్ధుల కోసం మల్టీ సర్వీస్ డే కేర్ సెంటర్

ఆసిఫాబాద్: జిల్లాలోని వయోవృద్ధుల సంక్షేమం కోసం మల్టీ సర్వీస్ డే కేర్ సెంటర్ ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థల ఎంపిక చేపట్టినట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం మల్టీ సర్వీస్ డేకేర్ సెంటర్ ఏర్పాటు కోసం జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అటల్ వయో అభ్యుదయ యోజనలో భాగంగా 50 మంది వయోవృద్ధుల కోసం డే కేర్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం మూడు స్వచ్ఛంద సంస్థలు దరఖాస్తు చేసుకోగా, సంబంధిత పత్రాలు, అర్హత పత్రాలు పరిశీలించారు. సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి అడెపు భాస్కర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంచాలి

ఆసిఫాబాద్‌రూరల్: విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయాలని ఏసీఎంవో ఉద్ధవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆదర్శ ఆశ్రమ పాఠశాలలో మంగళవారం ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలన్నారు. ఉదయం, సాయంత్రం ఫొటోలు తీసి వాట్సాప్ గ్రూపు ద్వారా పంపించాలని సూచించారు. సమావేశంలో హెచ్‌ఎం జంగు, జీసీడీవో శకుంతల తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవానికి తరలిరావాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పెంచికల్‌పేట్: ఈ నెల 9న నిర్వహించే ఆదివాసీ దినోత్సవానికి పెద్దఎత్తున తరలిరావాలని రాజ్‌గోండు సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెందోర్ సుధాకర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం ఆదివాసీ దినోత్సవం పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ హక్కుల సాధనకు ఆదివాసీలు ఐక్యంగా పోరాటం చేయాలన్నారు. ప్రతీ గ్రామంలో జెండా ఎగురవేయాలని కోరారు. సమావేశంలో జిల్లా మేడి కుర్సింగ మోతీరాం, కార్యనిర్వాహక కార్యదర్శి ఆత్రం చందన్‌షా, జిల్లా ప్రధాన కార్యదర్శి గుణవంత్‌రావు, జిల్లా కొలాం సంఘం కార్యదర్శి తిరుపతి, వివిధ సంఘాల నాయకులు ప్రభాకర్, మల్లేశ్, సకారాం, భుజంగరావు, శ్రీనివాస్, సాగర్, వెంకటేశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు వినతి

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంక్షేమ గురుకుల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్‌ఐ, కేవీపీఎస్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు జిల్లా కేంద్రంలో మంగళవారం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. డీవైఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్ మాట్లాడుతూ రెబ్బెనలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్, ఏఎన్‌ఎం నిర్లక్ష్యంతో విద్యార్థులు అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలయ్యారని ఆరోపించారు. మెనూ ప్రకారం భోజనం అందించడం లేదన్నారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దినకర్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కృష్ణ, టీకానంద్ తదితరులు పాల్గొన్నారు.

వానాకాలంలో భగ భగ

- పెరిగిన పగటి ఉష్ణోగ్రతలు
- వారం రోజులుగా జాడలేని వాన
- నాలుగు మండలాల్లో లోటు వర్షపాతం
- మందకొడిగా సాగుతున్న వరినాట్లు

మంగళవారం నమోదైన పగటి ఉష్ణోగ్రతలు

ప్రాంతం	ఉష్ణోగ్రతలు(డిగ్రీల సెల్సియస్)
సిర్పూర్(టి)	37.9
బెజ్జూర్	37.7
ఎల్కపల్లి	37.3
కౌటాల	37.0
వెంకట్రావ్‌పేట	36.7
లోనవెల్లి	36.6
దహెగాం	36.4
జంబుగా	36.2
గిన్నెదరి	36.1





కౌటాల మండలం గురుడుపేట శివారులో బీడుగా వరి పొలాలు

జిల్లాలో వర్షపాతం వివరాలు
(జూన్ నుంచి ఆగస్టు 5 వరకు మి.మీ.లలో)

మండలం	కురవాల్సింది	కురిసింది	స్థితి(శాతం)
జైనూర్	640.4	481.4	-25 లోటు
సిర్పూర్(యూ)	616.2	424.8	-38 లోటు
లింగాపూర్	598.1	623.0	+4 సాధారణం
తిర్యాణి	513.0	339.7	-22 లోటు
రెబ్బెన	514.9	586.9	+14 సాధారణం
ఆసిఫాబాద్	541.2	601.9	+11 సాధారణం
కెరమెరి	537.7	563.2	+5 సాధారణం
వాంకిడి	568.9	652.1	+15 సాధారణం
కాగజ్‌నగర్	553.4	668.8	+21 అధికం
సిర్పూర్(టి)	618.1	643.1	+4 సాధారణం
కౌటాల	660.3	683.2	+3 సాధారణం
చింతలమానెపల్లి	651.7	790.0	+21 అధికం
బెజ్జూర్	667.9	820.8	+21 అధికం
పెంచికల్‌పేట్	663.6	566.5	-11 సాధారణం
దహెగాం	652.8	467.4	-28 లోటు

కౌటాల(సిర్పూర్): వానాకాలం సీజన్‌లో భిన్న వాతావరణ పరిస్థితులు అన్నదాతలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో ఎండలు మండిపోతున్నాయి. ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మరోవైపు వారం రోజులుగా వాన జాడలేకపోవడంతో వ్యవసాయ పనులు మందకొడిగా సాగుతున్నాయి. సీజన్ ప్రారంభమైన తర్వాత జిల్లాలో జూన్, జూలై నెలల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. గత నెలలో కురిసిన వర్షాలకు పొలాలను దమ్ము చేయగా, ప్రస్తుతం వర్షాలు లేకపోవడం, కూలీల కొరతతో వరి పొలాలు బీడుగా దర్శనమిస్తున్నాయి. వర్షాధారంగా సాగు చేసే భూముల్లో నాట్లు వేసేందుకు రైతులు ఎదురుచూస్తున్నారు.

మండుతున్న సూరీడు..
వరుణుడు ముఖం చాటేయడంతో జిల్లాలో ఎండల తీవ్రత పెరుగుతోంది. వారం రోజులుగా పగటి పూట రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. పగలు, రాత్రి సమయంలో ఉక్కపోత ఉంటోంది. నైరుతి రుతుపవనాలతో ద్వితీయార్థంలో ఉష్ణోగ్రతలు తగ్గాల్సి ఉండగా.. ఆగస్టులో ఎండ తీవ్రతకు ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 10 గంటలు దాటితే సుర్రుమంటోంది. వ్యవసాయ కూలీలు పనులు చేయడానికి తిప్పలు పడుతున్నారు. సాయంత్రం మబ్బులతో వాతావరణం చల్లబడుతున్నా రాత్రంతా మళ్లీ ఉక్కపోత కొనసాగుతోంది. భిన్న వాతావరణంతో ఎండ వేడికి తలనొప్పి, ఒళ్లు నొప్పులు, జ్వరాలతో ప్రజలు బాధపడుతున్నారు. మరో మూడు, నాలుగు రోజులపాటు ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

జిల్లాలో సాధారణమే..
కార్తెలన్నీ కరిగిపోతున్నా కరువుతీరా వర్షాలు మాత్రం కురవడం లేదు. ఈ వానాకాలంలో సీజన్‌లో ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 598.5 మి.మీ. సగటు వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 598.2 మి.మీటర్లుగా నమోదైంది. జూన్, జూలైలో సాధారణ వర్షపాతం నమోదైందని అధికారులు పేర్కొంటున్నారు. అయితే జైనూర్, తిర్యాణి, సిర్పూర్(యూ), దహెగాం మండలాల్లో లోటు కనిపిస్తోంది. కాగజ్‌నగర్, బెజ్జూర్ మండలాల్లో అధిక వర్షపాతం నమోదు కాగా మిగతా మండలాల్లో సాధారణ వర్షపాతమే ఉంది. వారం రోజులుగా వరుణుడి జాడ లేకపోవడంతో వరినాట్లు మందకొడిగా సాగుతున్నాయి. ఈ నెల 15వ తేదీ వరకు వరి నాట్లు వేసుకోవచ్చని, ఈ నెలలో భారీ వర్షాలు కురిస్తే పంటల సాగుకు ఇబ్బంది ఉండదని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. అయితే ఆగస్టులో భారీ వర్షాలు పడకపోతే పంటల సాగుకు దేవుడే దిక్కని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరినాట్లు ఆలస్యం



గత నెలలో కురిసిన వర్షాలకు రెండెకరాల పొలం దమ్ము చేశాం. కూలీల కొరతతో నాట్లు వేయలేదు. ఎండలకు ప్రస్తుతం పొలం ఎండిపోయింది. బావి నుంచి విద్యుత్ మోటార్‌తో పొలానికి నీరందించి మళ్లీ దమ్ము చేశాం. వర్షాలు లేక వరి నాట్లు ఆలస్యమవుతున్నాయి. ఎండలకు కూలీలు కూడా పనులకు రావడం లేదు.
– ఎస్.చంద, యాపలగూడ, మం.కౌటాల

పనులు చేయలేకపోతున్నాం



వారం నుంచి వర్షం లేక ఎండలు మండిపోతున్నాయి. వ్యవసాయ చేనులో పనులు చేయలేకపోతున్నాం. మా గ్రామంలో వరినాట్లు ఇంకా పూర్తి కాలేదు. వేడికి రైతులు, కూలీలు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఉక్కపోత భరించలేకపోతున్నాం. ఆగస్టులో భారీ వర్షాలు కురువకపోతే వరి పొలాలు బీడుగానే వదిలేయాల్సిందే.
– దుర్కెట్టి సతీశ్, తిర్యాణి

‘నిఘా’ వైఫల్యం

- నేర పరిశోధనలో పెరిగిన సీసీ కెమెరాల ప్రాధాన్యత
- జిల్లాలో పనిచేయని నిఘా నేత్రాలు
- మరమ్మతులకు నిధులు లేక నిరుపయోగం



కౌటాలలోని కుమురంభీం చౌరస్తాలో నిరుపయోగంగా సీసీ కెమెరాలు

కౌటాల(సిర్పూర్): జిల్లాలో నేరాలు అదుపు చేసే లక్ష్యంతో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలకు మరమ్మతులు చేపట్టడం లేదు. వ్యాపార సముదాయాలు, ముఖ్య ప్రాంతాలు, రద్దీ ఏరియాల్లో నిఘా నేత్రాల ఉన్నా సరైన నిర్వహణ లేక నిరుపయోగంగా ఫలితంగా నిఘా వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. మరమ్మతులకు నిధులు లేకపోవడంతో నిరుపయోగంగా ఉంటున్నాయని పోలీసు అధికారులు చెబుతున్నారు. దీంతో ప్రశాంతంగా ఉండే జిల్లాలో చోరీలు పెరిగాయి.

కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా..
మండల కేంద్రాలు, పట్టణాల్లోని కూడళ్లలో బిగించిన సీసీ కెమెరాలు స్థానిక పోలీస్ స్టేషన్‌తోపాటు జిల్లా కేంద్రంలోని కమాండ్ కంట్రోల్ కార్యాలయానికి అనుసంధానించి ఉంటాయి. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రధాన చౌరస్తాల్లో ఏర్పాటు చేసినవి నాణ్యతగా చిత్రీకరిస్తాయి. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా జిల్లాలో దాదాపు 5 వేల వరకు వాణిజ్య సముదాయాలు, ప్రైవేట్ వ్యక్తుల సాయంతో కొన్నిచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. నాణ్యత లేకపోవడంతో తక్కువ కాలంలోనే అవి మరమ్మతులకు గురవుతున్నాయి. అభివృద్ధి పనులు, భారీ వర్షాలు, కోతుల కారణంగా కెమెరాలు, తీగలు దెబ్బతింటున్నాయి. భారీ వాహనాల రాకపోకలతో వైర్లు తెగిపోయి పనిచేయడం లేదు.

పరిశోధనలో కీలకం..
చోరీలు, రహదారి ప్రమాదాలు, అక్రమ రవాణా తదితర ఘటనల్లో నిందితులను గుర్తించేందుకు సీసీ కెమెరాలు కీలకంగా పనిచేస్తున్నాయి. గతంలో నేరం జరిగినప్పుడు కేసు పరిష్కరించడానికి పోలీసులు ఇబ్బంది పడేవారు. అనేక కోణాల్లో విచారణ చేపట్టేవారు. సీసీ కెమెరాలు వచ్చాక వారి పని సులువైంది. క్లిష్టమైన కేసులను సులువుగా త్వరగా పరిష్కరిస్తున్నారు. అయితే ప్రభుత్వం నుంచి సీసీ కెమెరాల ఏర్పాటు, నిర్వహణకు ప్రత్యేకంగా నిధులు లేకపోవడం పోలీస్ శాఖకు తలనొప్పిగా మారింది. చాలాచోట్ల అవి పనిచేయడం లేదు. షాపుల ఎదుట ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల దృశ్యాల ఆధారంగా పలుమార్లు కేసులు చేధించారు. కానీ సీసీ కెమెరాలు లేని ప్రాంతంలో చోరీ జరిగితే దొంగలను గుర్తించడం కష్టంగా మారుతుంది.

కరువైన పర్యవేక్షణ..
కమ్యూనిటీ పోలీసింగ్ కింద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నా వాటి పర్యవేక్షణపై శ్రద్ధ చూపడం లేదు. ఆధునిక సాంకేతికతపై ఆధారపడిన పోలీసులకు కొన్ని సందర్భాల్లో నిందితులను పట్టుకోవడం కష్టమవుతోంది. మరికొన్ని సందర్భాల్లో సీసీటీవీలకు నిందితులు చిక్కినా.. నాణ్యత లేక వారి ముఖాలు గుర్తించడం సాధ్యం కావడం లేదు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

స్వచ్ఛందంగా ముందుకు రావాలి



ఇళ్లు, షాపులతోపాటు ఆలయాల సమీపంలో సీసీ కెమెరాలు స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకునేందుకు ప్రజలు ముందుకు రావాలి. చోరీలు, ఇతర ఘటనలు జరిగినప్పుడు సీసీ కెమెరాల ఫుటేజీ కీలకంగా మారుతుంది. భారీ వర్షాలు, కోతల బెడదతో విద్యుత్ పరికరాలు పాడవుతున్నాయి. త్వరలోనే నిరుపయోగంగా ఉన్న సీసీ కెమెరాలను వినియోగంలోకి తెస్తాం. నిఘా నేత్రాల ఏర్పాటుకు పోలీస్ శాఖ వద్ద ప్రత్యేక నిధులు ఉండవు. వ్యాపారులు, ప్రజల సహకారంతో రద్దీ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నాం. 2 మెగా పిక్సెల్ కంటే ఎక్కువ నాణ్యత ఉండేవి బిగించుకునేలా అవగాహన కల్పిస్తాం.
– కాంతిలాల్ పాటిల్, ఎస్పీ

డీఈవో కార్యాలయంలో మెరిట్ జాబితా

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న అకౌంటెంట్, ఏఎన్‌ఎం పోస్టులు, యూఆర్‌ఎస్‌లో అసిస్టెంట్ కుక్, నైట్ వాచ్‌మెన్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్ జాబితా డీఈవో కార్యాలయంలో అందుబాటులో ఉంచామని అదనపు కలెక్టర్, డీఈవో దీపక్ తివారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9 వరకు అభ్యంతరాలు తెలియజేయాలని సూచించారు.

విధులను నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదు

- బడీడు పిల్లలందరూ బడిలో ఉండాలి
- డీఈవోగా బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్



అదనపు కలెక్టర్ దీపక్ తివారికి పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఈవో కార్యాలయ సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్: ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు విధులను నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని అదనపు కలెక్టర్, డీఈవో దీపక్ తివారి హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలో మంగళవారం జిల్లా విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లాలోని ఎంఈవోలు, ఎస్‌వోలు, హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బడీడు పిల్లలందరూ బడిలో ఉండాలన్నారు. ప్రతిరోజూ విద్యార్థులు పాఠశాలలకు హాజరయ్యేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. స్కూళ్లకు వస్తేనే గుణాత్మక విద్యనందించవచ్చన్నారు. పిల్లలను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎంఈవోలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు తమ పరిధిలోని పాఠశాలలను నిత్యం సందర్శిస్తూ ఎడ్యుకేషన్ యాప్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. పదో తరగతి పాఠ్యాంశాలు సకాలంలో పూర్తిచేసి, అత్యుత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు. అంతకు ముందు డీఈవో కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్, ప్లానింగ్ కోఆర్డినేటర్ అబిద్ అలీ, ఏసీజీ ఉదయ్‌బాబు, ఎఫ్‌ఏడీ దేవాజీ, ఎంఈవోలు ప్రకాశ్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా



ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయుల పోరాట సమితి(యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. నాయకులు చరణ్‌దాస్, శాంతికుమారి మాట్లాడుతూ పీఆర్‌సీని వెంటనే ప్రకటించి అమలు చేయాలని, పెండింగ్ డీఏ చెల్లింపు, సీపీఎస్ రద్దు, ఓపీఎస్ అమలు, సర్దుబాటు జీవో 25 సవరణ, రెగ్యులర్ ఎంఈవోల నియామకంతోపాటు 317 జీవోతో నష్టపోయిన టీచర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ పొందిన వారికి బకాయిలు చెల్లించాలని, సమగ్ర శిక్ష ఉద్యోగులకు సమ్మె కాలపు వేతనాలు మంజూరు చేయాలన్నారు. గురుకులాల్లో పనిచేస్తున్న పార్ట్ టైం, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. ఊశన్న, కేశవ్, శ్రీనివాస్, శంకర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఆర్‌బీఐ డీజీఎం జగదీశ్‌కుమార్

కెరమెరి(ఆసిఫాబాద్): బ్యాంకు సేవలను రైతులు, సామాన్య ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌బీఐ డీజీఎం టి.జగదీశ్‌కుమార్ అన్నారు. మండలంలోని కొఠారిలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. జన సురక్ష ప్రోగ్రాం ఎంతో ప్రతిష్టాత్మకమైందని, బ్యాంకు సేవలపై పంచాయతీల వారీగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కొత్త, పాత బ్యాంకు ఖాతాలు పదేళ్లుగా వాడకపోయినా తిరిగి యాక్టివ్ చేయడం, పీఎంజేబీఎస్, పీఎం ఎస్‌బీవై, ఏపీవై పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఖాతాలకు కేవైసీ చేయించుకోవాలన్నారు. డిజిటల్ బ్యాంకింగ్, సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. సుకన్య సమృద్ధి యోజన గురించి వివరించారు. కార్యక్రమంలో ఆర్‌బీఐ ఎల్‌డీవో వెన్న శ్రీనివాస్, మంచిర్యాల ఆర్‌ఎం రితీష్ కుమార్ గుప్తా, ఆసిఫాబాద్ ఎల్‌డీఎం రాజేశ్వర్‌జోషి, అడ, కెరమెరి బ్యాంకు మేనేజర్లు నందన్, శ్రీపాద్, ఎంపీడీవో అంజద్‌పాషా తదతరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ బాధితులకు తక్షణమే నష్టపరిహారం

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, పక్కన ఎస్పీ కాంతిలాల్ పాటిల్, అధికారులు

ఆసిఫాబాద్: అట్రాసిటీ కేసుల్లో బాధితులకు తక్షణమే నష్టపరిహారం అందించి భరోసా కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎస్పీ కాంతిలాల్ పాటిల్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఏఎస్పీ చిత్తరంజన్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, జిల్లాస్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులతో కలిసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతినెలా 30న ప్రతీ మండలంలోని ఒక గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం పకడ్బందీగా నిర్వహించి, అట్రాసిటీ చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మహిళల అక్రమ రవాణా, డ్రగ్స్, గంజాయి వంటి నిషేధిత పదార్థాలను నియంత్రించేందుకు నషా ముక్త్ భారత్ అభియాన్ కింద అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు 21 కేసులు నమోదు చేశామని తెలిపారు. బాధితులకు నష్ట పరిహారం అందించి, కేసులు నమోదైన వారికి శిక్ష పడేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మానిటరింగ్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆదివాసీలు, మహిళలపై లైంగిక వేధింపులు, మానవ అక్రమ రవాణాపై దృష్టి సారించాలని అధికారులను కోరారు. కేసులు నమోదైన వారికి స్టేషన్ బెయిల్ ఇవ్వొద్దన్నారు. సమావేశంలో ఎస్సీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి సజీవన్, కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, కమిటీ సభ్యులు రేగుంట కేశవరావు, సిడాం అర్జు, కోట్రగడే గంగుబాయి, ఇగురపు గణేశ్, మాహోర్కర్ అశోక్, పి.వెంకట్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పీఎంశ్రీతో వసతులు మెరుగు

- ప్రభుత్వ బడులకు ప్రత్యేక నిధులు
- సౌకర్యాల కల్పనకు పెద్దపీట
- అత్యుత్తమ పాఠశాలగా పెంచికల్‌పేట్ జెడ్పీ స్కూల్ ఎంపిక



పెంచికల్‌పేట్ జెడ్పీ పాఠశాల

పెంచికల్‌పేట్(సిర్పూర్): ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించడం, నాణ్యమైన విద్య అందించడానికి కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ(ప్రధాన మంతి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా) పాఠశాలలకు శ్రీకారం చుట్టింది. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడంతోపాటు అన్ని రంగాల్లో తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇటీవల కేంద్ర విద్యాశాఖ మంత్రి ఢిల్లీలో పీఎంశ్రీ పాఠశాలలను జాతికి అంకితం చేశారు. జిల్లాలో 18 పీఎం శ్రీ పాఠశాలలు ఉండగా వీటిలో పెంచికల్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను అత్యుత్తమ పాఠశాలగా అధికారులు ఎంపిక చేశారు.

బోధన ప్రత్యేకం..
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న పీఎంశ్రీ పాఠశాలల్లో వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. అదనపు తరగతుల నిర్వహణ, సైన్స్, మ్యాథ్స్ ల్యాబ్స్, అటల్ థింకింగ్ లైబ్రరీ, కంప్యూటర్, ప్యానల్ ఆధారిత బోధన చేపడుతున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్యానల్స్, బొమ్మల ద్వారా బోధన చేపడుతూ విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవనాలు కల్పిస్తున్నారు. మరో వైపు విద్యార్థుల్లో పర్యావరణంపై ఆసక్తిని పెంచడానికి తోటల పెంపకం, నీటి సంరక్షణకు ఇంకుడు గుంతల ఏర్పాటు, స్వచ్ఛత, మొక్కల పెంపకం, యూత్ ఎకో క్లబ్, సెల్ఫ్ డిఫెన్స్, సౌర విద్యుత్ దీపాల ఏర్పాటు చేశారు.

పెంచికల్‌పేట్ స్కూల్‌కు నిధులు
పీఎంశ్రీ పాఠశాలలకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తోంది. ఆరు నుంచి పదో తరగతి వరకు మౌలిక వసతులు కల్పిస్తోంది. పెంచికల్‌పేట్ ఉన్నత పాఠశాలకు రూ.18,79,990 నిధులు విడుదల చేసింది. రూ.11.80లక్షలతో ల్యాబ్, లైబ్రరీ నిర్మాణం పూర్తి చేశారు. మిగతా నిధులతో పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. అత్యుత్తమ పాఠశాలగా ఎంపిక చేయడంతో మరో రూ.15లక్షలు పాఠశాలకు అందనున్నాయి.

క్షేత్ర పర్యటనలతో అనుభవాలు..
తరగతి గదులతోపాటు విద్యార్థుల్లో ప్రత్యక్ష అనుభూతిని పెంపొందించడానికి క్షేత్ర పర్యటనలు చేస్తున్నారు. ఏటా ఫీల్డ్ ట్రిప్స్, ఎక్స్‌ప్లోజర్ విజిట్, సైన్స్, మ్యాథ్స్ యాక్టివిటీలు, పాఠశాల వార్షికోత్సవాలు, ట్రెయినింగ్ మోటివేషనల్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆధునిక పోటీ ప్రపంచంలో విద్యార్థులను తీర్చిదిద్దడానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పది డెస్క్‌టాప్ కంప్యూటర్ల ద్వారా డిజిటల్ బోధన చేస్తున్నారు. లైబ్రరీలో వివిధ రకాల పుస్తకాలు అందుబాటులో ఉంచి విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందిస్తున్నారు.

ఆనందంగా ఉంది
అధికారులు పీఎంశ్రీలో పెంచికల్‌పేట్ ఉన్నత పాఠశాలను అత్యుత్తమ స్కూల్‌గా ఎంపిక చేయడం ఆనందంగా ఉంది. ప్రభుత్వం ఇచ్చిన నిధులతో అనేక కార్యక్రమాలు చేపడుతున్నాం. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నాం. డిజిటల్ బోధన ద్వారా నైపుణ్యాలు పెంపొందిస్తున్నాం. రానున్న రోజుల్లో పాఠశాలను మరింత అత్యుత్తమంగా తీర్చిదిద్దుతాం.
– విజయనిర్మల, హెచ్‌ఎం, పీఎంశ్రీ జెడ్పీ ఉన్నత పాఠశాల, పెంచికల్‌పేట్

క్లుప్తంగా

ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు

తాంసి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడిపై మంగళవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై జీవన్‌రెడ్డి తెలిపారు. పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న గీతేశ్వర్ కొంత కాలంగా విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. వెకిలిచేష్టలు చేస్తూ వేధింపులకు గురి చేస్తున్నాడు. సదరు విద్యార్థినుల ఫిర్యాదు మేరకు ఉపాధ్యాయుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వెల్లడించారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దు

ఇంద్రవెల్లి: విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. దొడందా గ్రామంలోని మెస్రం తుల్సీరాం అనే రైతుకు చెందిన ఎద్దు మంగళవారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో మేత మేస్తుండగా ఎర్తింగ్ వైర్‌కు తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ.40 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు. కాగా విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఎర్తింగ్ వైర్‌కు విద్యుత్ సరఫరా కావడంతో ఎద్దు మృతి చెందిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

దాడి కేసులో ఇద్దరి రిమాండ్



నిందితుల అరెస్టు చూపుతున్న ఎస్సై

కాసిపేట: మండలంలోని కోమటిచేను గ్రామంలో రాంటెంకి శివరాంపై దాడి చేసిన ఘటనలో అదే గ్రామానికి చెందిన జాడి రవి, అతని కుమారుడు జాడి సాయికుమార్‌ను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. గత నెల 25న రాత్రి శివరాంపై కత్తితో దాడి చేయడంతో గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

స్కూల్ విద్యార్థుల ఆటో బోల్తా

- ఇద్దరికి స్వల్పగాయాలు

చెన్నూర్‌రూరల్: మండలంలోని నారాయణపూర్ గ్రామ సమీపంలో పాఠశాల విద్యార్థులతో వెళ్తున్న ఆటో బోల్తా పడింది. నారాయణపూర్ నుంచి మంగళవారం తొమ్మిది మంది స్కూల్ విద్యార్థులను ఎక్కించుకున్న ఆటో బావురావుపేట సమీపంలోని ఆస్సిసి పాఠశాలకు వెళ్తుండగా మార్గమధ్యలో అదుపుతప్పి బోల్తా పడింది. గమనించిన స్థానికులు విద్యార్థులను బయటకు తీశారు. ఇద్దరు విద్యార్థులకు స్వల్పగాయాలు కావడంతో 108కు సమాచారం అందించారు. ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం జరిగిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ దేవేందర్ తెలిపారు.

ఆటో టైర్లు చోరీ



టైర్లు చోరీకి గురైన ఆటో

తాండూర్: మండలంలోని అచ్చలాపూర్‌లో సోమవారం రాత్రి ఆటో టైర్లు చోరీకి గురైనట్లు వాహన యజమాని ఏముర్ల రాకేష్ తెలిపారు. ఎప్పటిలాగే తన ఇంటి ముందు పార్కింగ్ చేశానని, రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆటో మూడు టైర్లను అపహరించుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నకిలీ బాబాలపై కేసులు

ఆదిలాబాద్‌టౌన్: అమాయక ప్రజలకు మాయ మాటలు చెప్పి మోసాలకు పాల్పడుతున్న నకిలీ బాబాలపై కేసులు నమోదయ్యాయి. జిల్లా వ్యాప్తంగా నకిలీ బాబాల భరతం పట్టేందుకు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా మంగళవారం ఏకకాలంలో జిల్లా వ్యాప్తంగా దాడులు జరిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని బొక్కల్‌గూడకు చెందిన జుబేర్, ఖానాపూర్‌కు చెందిన ఉస్మాన్‌లపై కేసులు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. జ్వరం, ఇతర వ్యాధులతో బాధపడుతున్న వారికి తావీతులు, విభూది, నిమ్మకాయలు, తదితర వాటిని ఇస్తూ వారి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా బేల, ఇచ్చోడలో ఒక్కొక్కరిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రాత్రి వరకు ఈ దాడులు జరిగాయి.

పర్యాటకం.. అభివృద్ధికి దూరం

- కడెం.. సహజ సౌందర్య నిలయం
- ఏడాది పొడవునా పర్యాటకుల రాక
- శిథిలావస్థకు డీలక్స్ బోటు
- మూలనపడిన స్పీడ్ బోటు
- పట్టించుకోని పర్యాటక శాఖ



మరమ్మతులకు నోచుకోని స్పీడ్ బోటు



బోటింగ్ చేస్తున్న పర్యాటకులు (ఫైల్)



బోటింగ్ పాయింట్ వద్ద పర్యాటకులు

కడెం: సహజ సిద్ధమైన ప్రకృతి అందాలకు నిలయంగా నిలిచిన కడెం ప్రాజెక్టు, రాష్ట్రంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందింది. 2010లో పర్యాటక శాఖ బోటింగ్‌ను ప్రవేశపెట్టడంతో పర్యాటకుల సంఖ్య క్రమంగా పెరిగింది. ఈ అందమైన ప్రాజెక్టును తిలకించేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తున్నారు. అయితే, పెరిగిన పర్యాటకుల సంఖ్యకు తగ్గ సౌకర్యాలు లేకపోవడంతో సందర్శకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వం కడెంను పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పర్యాటక కేంద్రంగా..

2010లో బోటింగ్ ప్రవేశపెట్టినప్పటి నుంచి కడెం ప్రాజెక్టు పర్యాటక రంగంలో గణనీయమైన ఆదరణ పొందింది. 2015లో 12 విడిది గదులు, రెస్టారెంట్‌తో కూడిన హరిత రిసార్ట్స్‌ను ఏర్పాటు చేయడంతో ఈ ప్రాంతం మరింత ఆకర్షణీయంగా మారింది. ప్రస్తుతం హరిత రిసార్ట్స్‌ను ప్రైవేటు సంస్థలకు అప్పగించారు. పర్యాటకుల విడిది కోసం ఒక రిసార్ట్, రెండు లాడ్జీలు అందుబాటులో ఉన్నాయి. ఈ సౌకర్యాలతో కడెం రాష్ట్రంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా రూపొందింది.

అభివృద్ధి లేక ఇబ్బందులు..

కడెం బోటింగ్ యూనిట్‌లో ఒక డీలక్స్ బోటు, స్పీడ్ బోటును ప్రవేశపెట్టినప్పటికీ, సౌకర్యాల నిర్వహణలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. గతంలో రూ.30గా ఉన్న బోటింగ్ టికెట్ ధరను రూ.50కి పెంచారు, కానీ సౌకర్యాలు మెరుగుపరచకపోవడంతో ఆదాయం గణనీయంగా తగ్గింది. స్పీడ్ బోటు మోటారు చెడిపోయి సంవత్సరాలు గడిచినా మరమ్మతులు చేయకపోవడంతో అది మూలన పడింది. డీలక్స్ బోటు శిథిలావస్థలో ఉన్నప్పటికీ, తాత్కాలిక మరమ్మతులతో నడుపుతున్నారు. బోటింగ్‌కు 16 మంది లేదా రూ.600 చెల్లించాల్సిన నిబంధన వల్ల చాలా మంది పర్యాటకులు నిరాశతో వెనుదిరుగుతున్నారు.

శిథిలావస్థలో సౌకర్యాలు..

కడెం బోటింగ్ స్టాండ్‌ను గతంలో రాత్రికి రాత్రి నాగర్‌కర్నూల్ జిల్లా సోమశీలకు తరలించారు, దాని స్థానంలో పాత స్టాండ్‌ను వదిలేశారు. ప్రస్తుతం ఈ స్టాండ్ కూడా శిథిలావస్థకు చేరింది. బోటింగ్ సిబ్బంది తాత్కాలికంగా తాళ్లు, తెప్పలతో దాన్ని నడిపిస్తున్నారు, దీంతో పర్యాటకులకు ప్రమాద భయం పొంచి ఉంది. సౌకర్యాల నిర్వహణలో నిర్లక్ష్యం వల్ల గతంలో లక్షల్లో వచ్చిన ఆదాయం గణనీయంగా తగ్గిపోయింది.

ప్రాజెక్టు అందాలు బాగున్నాయి



కడెం ప్రాజెక్టును విజిట్ చేశాం. ప్రకృతి సిద్ధమైన కడెం ప్రాజెక్టు అందాలు బాగున్నాయి. బోటింగ్ చేశాం. ఇక్కడ ఒకటే బోటు ఉంది. స్పీడ్ బోటుతో పాటు పైడల్ బోటు లాంటివి ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– దివ్య, పర్యాటకురాలు, రాజమండ్రి

అభివృద్ధి చేయాలి



మిత్రులతో కలిసి కడెం ప్రాజెక్టు సందర్శనకు వచ్చాం. కడెం ప్రాజెక్ట్, పరిసర ప్రాంతాలను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయాలి. నీటి మధ్యలో ఉన్న ఐ ల్యాండ్ వరకు బోటును తీసుకెళ్తే బాగుంటుంది. ప్రాజెక్ట్‌లో వాటర్ గేమ్స్ లాంటివి ఏర్పాటు చేయాలి.

– చంద్రశేఖర్, పర్యాటకుడు, విజయవాడ

శిశుమందిరాల్లో విద్యతోపాటు క్రమశిక్షణ

- ఎమ్మెల్యే రామారావు పటేల్
- రాష్ట్రస్థాయి ఖేల్‌కూద్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే

భైంసాటౌన్: విద్యార్థులకు విద్యతోపాటు క్రమశిక్షణ, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, దేశం పట్ల భక్తిభావన పెంపొందించడంలో సరస్వతి శిశు మందిరాలు విశేష కృషి చేస్తున్నాయని ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ అన్నారు. పట్టణంలోని కిసాన్ గల్లి శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో మంగళవారం రాష్ట్రస్థాయి ఖేల్‌కూద్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు అవసరమేనన్నారు. కార్యక్రమంలో విద్యాపీఠం ప్రాంత అధ్యక్షుడు తిరుపతిరావు, సంఘటన కార్యదర్శి శ్రీనివాసరావు, ప్రాంత శైక్షనిక్ ప్రముఖ్ కృష్ణమాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేతకాని కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న దుర్గం రాజేశ్

దండేపల్లి: నేతకానీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేశ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన నేతకానీ మహర్ సంక్షేమ సంఘం మండల సమావేశానికి హాజరై మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రత్యేక కోటా ప్రకటించాలని, నామినేటెడ్ పదవుల్లో ప్రత్యేక స్థానం కల్పించాలని, స్థానిక ఎన్నికల్లో 50 శాతం సీట్లు కేటాయించాలని కోరారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి గోళ్ల రాజమల్లు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రకాశ్, నర్సయ్య, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు యువరాజు, జిల్లా అధ్యక్షుడు రాంబాబు, నాయకులు శ్రీనివాస్, రాములు, రాజలింగు, పోశన్న, తదితరులు పాల్గొన్నారు.

గిత్తే కార్తీక్‌కు ఆర్థికసాయం



శివాజీ ప్రతిమ బహూకరిస్తున్న సీడీ చౌహాన్

కెరమెరి: హిమాచల్ ప్రదేశ్‌లోని స్పీటీ వ్యాలీలో ఈ నెల 9నుంచి 19 వరకు నిర్వహించే మౌంట్ యూనమ్ పర్వతారోహనకు కుమురంభీం జిల్లా కెరమెరి మండలంలోని కెలికే గ్రామానికి చెందిన మౌంటేనీయర్ గిత్తే కార్తీక్ ఎంపికయ్యాడు. సికింద్రాబాద్‌కు చెందిన గ్లోబల్ హిందూ ఫెడరేషన్, ఛత్రపతి శివాజీ మహరా ఫౌండేషన్ వ్యవస్థాపకులు, చైర్మన్ సీడీ చౌహాన్ మంగళవారం ఛత్రపతి శివాజీ ప్రతిమతో పాటు రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. సాహసయాత్ర పూర్తి చేసుకున్నాక మరో రూ.30 వేలు అందించనున్నట్లు ప్రకటించారు. కాగా కార్తీక్ హైదరాబాద్‌లోని ఏఐఎంఎస్ కాలేజీ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్, క్యాటరింగ్ టెక్నాలజీలో విద్యాభ్యాసం చేస్తున్నాడు. భారత రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అడ్వాన్స్‌డ్ మౌంటనీరింగ్ కోర్సును గతంలో పూర్తి చేశాడు. ఎన్నో సాహస కృత్యాల్లో పాల్గొని అవార్డులు సొంతం చేసుకున్నాడు.

దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శశిధర్‌రెడ్డి

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గద్దెరాగిడి భవానీ బార్ అండ్ రెస్టారెంట్ వద్ద ఈ నెల 3న ఓ యువకుడిపై దాడికి పాల్పడిన ఘటనలో నిందితుడు పంగ శ్రీధర్‌ను మంగళవారం అరెస్టు చేసినట్లు మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి, పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. పోలీస్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గద్దెరాగిడికి చెందిన ఊటూరి హరీష్ భవానీ బార్ దగ్గర ఉండగా అక్కడే ఉన్న శ్రీధర్ తనకు మద్యం ఇప్పించాలని కోరగా నిరాకరించడంతో మహేందర్, తిరుపతి అనే మరో ఇద్దరు స్నేహితులతో కలిసి దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు శ్రీధర్‌ను అరెస్టు చేసి అతనిపై రౌడీషీట్‌కు కూడా ఓపెన్ చేశామని, పరారీలో ఉన్న మరో ఇద్దరిని త్వరలోనే పట్టుకుంటామని సీఐ తెలిపారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య



నీలిమ (ఫైల్)

మంచిర్యాలక్రైం: పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, ఎస్సై మజారొద్దీన్ తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని భగవంతంవాడకు చెందిన గోపు సత్యనారాయణ, భారతమ్మ దంపతుల కుమార్తె నీలిమ (37)కు గద్దెరాగడికి చెందిన లారీ డ్రైవర్ మానేం రాజేందర్‌తో వివాహమైంది. దంపతులకు కుమారుడు, కుమార్తె సంతానం. సదరు మహిళ కొంతకాలంగా కడుపు నొప్పి, గర్భసంచి సమస్యలతో బాధపడుతోంది. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురైంది. ఇటీవల తల్లిగారింటికి వచ్చింది. ఈ నెల 3న పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు ముందుగా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందింది. మహిళ తండ్రి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు..



గణేశ్ (ఫైల్)

దండేపల్లి: ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై తహసీనొద్దీన్ తెలిపిన వివరాల మేరకు నంబాల గ్రామానికి చెందిన కొండ గణేశ్ (32), ప్రవళిక దంపతులు కూలీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారికి ఇద్దరు పిల్లలు సంతానం. ఇద్దరూ కష్టపడి పనిచేస్తున్నా కుటుంబ అవసరాలకు డబ్బులు చాలడం లేదని గణేశ్ పలుమార్లు భార్యతో చెప్పుకుంటూ బాధపడేవాడు. ఈక్రమంలో మంగళవారం కూలీ పని నిమిత్తం ప్రవళికను బైక్‌పై తీసుకెళ్లి గ్రామ సమీపంలోని పత్తిచేను వద్ద దింపి వెళ్లాడు. మధ్యాహ్నం నంబాల బ్రిడ్జివద్ద పురుగుల మందు తాగి విషయాన్ని సోదరుడు రమేశ్‌కు ఫోన్‌చేసి చెప్పడంతో వెంటనే లక్సెట్టిపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ప్రవళిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

రైలు కిందపడి ఒకరు..

కాగజ్‌నగర్‌టౌన్: రైలు కిందపడి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని కాపువాడకు చెందిన మహ్మద్ షబ్బీర్ (52)మద్యానికి బానిసై ఇంట్లో కుటుంబ సభ్యులతో తరచూ గొడవ పడుతుండేవాడు. దీంతో మనస్తాపానికి గురై మంగళవారం తెల్లవారుజామున రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద బెల్లంపల్లి నుంచి బల్లార్షాకు వెళ్లే గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.

భుక్తాపూర్‌లో యువతి..

ఆదిలాబాద్‌టౌన్: ఉరేసుకుని యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం జిల్లా కేంద్రంలోని భుక్తాపూర్‌లో చోటు చేసుకుంది. ఉట్నూర్‌కు చెందిన మౌనిక (25) ఆదిలాబాద్ పట్టణంలోని ఓ చెప్పుల దుకాణంలో పనిచేస్తూ భుక్తాపూర్‌లోని ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. సాయంత్రం షాపు నుంచి ఇంటికి వెళ్లిన యువతి ఉరేసుకుని అఘాయిత్యానికి పాల్పడినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. పోస్టుమార్టమ్ నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించినట్లు తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని ఒకరు..



కార్తీక్ (ఫైల్)

మందమర్రిరూరల్: భార్య కాపురానికి రావడం లేదని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఏఎస్సై మజీద్‌ఖాన్ తెలిపిన వివరాల మేరకు మందమర్రిలోని రెండవ జోన్‌కు చెందిన సింగరేణి కార్మికుడు శనిగారపు కార్తీక్ (30)కు హనుమకొండకు చెందిన లాస్యతో 2018లో వివాహమైంది. దంపతులకు కుమారుడు ఆర్యన్ (7), కూతురు ఆరాధ్య (5) ఉన్నారు. కుటుంబంలో గొడవలు జరగడంతో నెలరోజుల క్రితం లాస్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురై సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయకపోవడంతో మంగళవారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులు ఇంటికి వెళ్లి చూడగా ఉరేసుకుని కనిపించాడు. మృతుని అన్న సాగర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

కడెం కాలువలో గుర్తుతెలియని మృతదేహం

దస్తురాబాద్: కడెం ఎడమ కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. మల్లాపూర్ గ్రామ సమీపంలోని కడెం ఎడమ కాలువలోని ముళ్లపొదల్లో మంగళవారం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. స్థానికుల సాయంతో పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించారు. పూర్తిగా కుళ్లిపోయి ఉందని, మృతునికి 45 నుంచి 55 సంవత్సరాల వయస్సు ఉంటుందని తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎరుకల సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఓదెలు



నియామకపు పత్రంతో ఓదెలు

రామకృష్ణాపూర్: ఎరుకల ప్రజా సమితి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడిగా రామకృష్ణాపూర్ పట్టణానికి చెందిన రేవెల్లి ఓదెలును ఎన్నుకున్నారు. మంగళవారం శ్రీరాంపూర్‌లో జరిగిన సమావేశంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతి నియామకపత్రం అందజేశారు. ఎరుకల ప్రజల అభివృద్ధి కోసం, ఎరుకల జాతి చైతన్యం కోసం తనవంతు కృషి చేస్తానని ఓదెలు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన హాకీ క్రీడాకారులు

ఆదిలాబాద్: జాతీయ స్థాయి జూనియర్ హాకీ పోటీలకు జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికై నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలూరి గోవర్ధన్ రెడ్డి, పార్థసారథి తెలిపారు. ఆదిలాబాద్ ప్రభుత్వ గిరిజన డిగ్రీ కళాశాలకు చెందిన కొడప ప్రదీప్, వెట్టి సుదర్శన్ ఎంపికయ్యారని, ఈ నెల 12 నుంచి పంజాబ్‌లోని జలంధర్‌లో జరిగే పోటీల్లో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు.

ఒకరిపై గంజాయి కేసు

ఇంద్రవెల్లి: మండలంలోని దనోరా(బి)లో ఒకరిపై గంజాయి కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. గ్రామానికి చెందిన పరశురాం తన ఇంటి పెరట్లో గంజాయి మొక్కలు సాగు చేసినట్లు తమకు అందిన సమాచారం మేరకు మంగళవారం తనిఖీలు నిర్వహించగా 23 గంజాయి మొక్కలు లభ్యమైనట్లు తెలిపారు. మొక్కలను ధ్వంసం చేసి నిందితునిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అల్లుడిని హతమార్చిన అత్త

- కర్రతో తలపై బాది గొంతునులిమి హత్య
- ముధోల్ మండలంలోని తరోడలో ఘటన



షేక్ నజీమ్ మృతదేహం

తానూరు(ముధోల్): అత్త చేతిలో అల్లుడు హతమైన సంఘటన నిర్మల్ జిల్లా ముధోల్ మండలంలోని తరోడలో చోటు చేసుకుంది. సీఐ మల్లేశ్ తెలిపిన వివరాల మేరకు మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా హిమాయత్‌నగర్‌కు చెందిన షేక్‌నజీమ్(45) కుటుంబం పదేళ్ల క్రితం ముధోల్ మండలంలోని తరోడలో నివాసం ఉంటోంది. ఇటుకబట్టీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. నజీమ్ అత్తగారైన రహీమున్నీసా వారితో కలిసి ఉంటోంది. వర్షాకాలం కావడంతో ఇటుకల తయారీ పనిలేక పోవడంతో మృతుని భార్య షేక్ సాహెబి ఈనెల 2న శనివారం మహారాష్ట్రలోని శివాని గ్రామానికి మేస్త్రీ పనికోసం వెళ్లింది. ఈ నెల 4న తెల్లవారు జామున నజీమ్ మద్యం సేవించి వచ్చి అత్తను లైంగికంగా వేధించడమే కాకుండా ఆమెపై చేయి చేసుకున్నాడు. అదే రోజు సాయంత్రం 6 గంటలకు మద్యం మత్తులో ఉన్న నజీమ్ మళ్లీ ఆమెతో గొడవపడడంతో కర్రతో తలపై దాడిచేసి గొంతునులిమి హత్య చేసింది. మంగళవారం ఉదయం స్థానికులు అందించిన సమాచారం సీఐ మల్లేశ్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని భార్య షేక్ సాహెబి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితురాలు రహీమున్నీసాను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



కూనారపు వంశీ(ఫైల్)

మందమర్రిరూరల్: మందమర్రి పోలీసుస్టేషన్ పరిధిలోని అందుగులపేట మేడారం ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలో సోమవారం రాత్రి 10.30గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో కూనారపు వంశీ(32) మృతిచెందాడు. మందమర్రి ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. దొర్నకల్‌కు చెందిన వంశీ తన భార్య స్వాతితో కలిసి ద్విచక్ర వాహనంపై అత్తగారి ఊరైన తాండూర్‌కు వెళ్తున్నాడు. అందుగులపేట వద్ద ద్విచక్ర వాహనాన్ని నిలిపి ఉంచగా.. వెనుక నుంచి అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో వంశీ తీవ్రంగా గాయపడ్డాడు. మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు. వంశీకి భార్య స్వాతి, కుమారుడు ఉన్నారు.

బావిలో పడి వృద్ధుడు..



మల్లయ్య (ఫైల్)

బజార్‌హత్నూర్: ప్రమాదవశాత్తు బావిలో పడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సంజయ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని కాండ్లి గ్రామానికి చెందిన పట్ల మల్లయ్య (60) కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్నాడు. సోమవారం గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తు పడిపోవడంతో మృతి చెందాడు. మృతుని భార్య పట్ల లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

నేరడిగొండ: మండలంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇచ్చోడ మండలం సల్యాద గ్రామానికి చెందిన చిక్రం సోమేష్ (23) మృతి చెందినట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు. ఇచ్చోడ మండలం సల్యాదకు చెందిన చిక్రం సోమేష్, తొడసం హన్మంతు ద్విచక్ర వాహనంపై నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం రాయాదరికి వెళ్లి వస్తుండగా ఆరేపల్లి–కొరటికల్ జాతీయ రహదారి మధ్యలో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. చిక్రం సోమేష్ అక్కడికక్కడే మృతి చెందగా తొడసం హన్మంతుకు తీవ్రగాయాలయ్యాయి. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు

- ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వన్యప్రాణుల వేటగాళ్ల కోసం జిల్లా వ్యాప్తంగా పది ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపట్టి నాలుగు కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నిందితుల నుంచి ఒక డబుల్ బోర్‌గన్, ఒక ఎయిర్‌గన్, జింక కొమ్ములతో కూడిన తల, రెండు జింక కొమ్ములు, కత్తులు, టార్చ్‌లైట్లు, వేట సామగ్రి, వైర్లు, బరిసెలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 1, మావల పోలీసు స్టేషన్‌లో 2, తాంసి పోలీసు స్టేషన్ పరిధిలో 1 కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఆదిలాబాద్ పట్టణంలోని పంజేషా మొహల్లాకు చెందిన షోయబ్ అఫ్జల్ వద్ద ఒక డబుల్ బోర్‌గన్, జింక తల, రెండు జింక కొమ్ముల ముక్కలు, వేటకు ఉపయోగించిన సామగ్రి, కత్తులు, జాకెట్లు, షూలు లభించినట్లు చెప్పారు. మావల మండలంలోని వాగాపూర్‌కు చెందిన ఆత్రం మారుతి, ఆత్రం భీంరావు వద్ద 50 మీటర్ల జీవైర్, నైలన్ మెష్, జంతువులను వేటాడే సామగ్రి, ఒక ఈటె, ఎలక్ట్రిక్ వైర్ లభించినట్లు తెలిపారు. తాంసి మండలంలోని ఘోట్కురికి చెందిన షేక్ షరీఫ్ వద్ద ఎయిర్‌గన్ లభించినట్లు పేర్కొన్నారు. వారిపై ఆయా పోలీసుస్టేషన్లలో కేసులు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్, మావల సీఐ కర్రె స్వామి, ఎస్సై ఇసాఖ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.